నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

12 నిజామాబాద్, మంగళవారం 12 నవంబర్ 2024 NIZAMABAD





స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులు, (ఇన్‌సెట్‌లో) ఉత్సవమూర్తులు

## కమనీయం నర్సన్న లగ్గం

- జనసంద్రమైన లింబాద్రి గుట్ట
- వేదమంత్రాలతో పులకించిన నింబాచలం

భీమ్‌గల్, నవంబర్ 11 : నింబాచల క్షేత్రంలో కొలువైన లక్ష్మీనృసింహుడి కల్యాణం సోమవారం వైభవోపేతంగా జరిగింది. ఆలయ ధర్మకర్తలు వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా వివాహ క్రతువును నిర్వహించారు. ఇందూరు ఇలవేల్పుగా భావించే నర్సన్న లగ్గానికి భక్తులు భారీగా తరలిరావడంతో లింబాద్రిగుట్ట భక్తజన సంద్రమైంది. నింబాచలంలో ఈ నెల 7న ప్రారంభమైన వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా జరిపించారు. ఆలయ ధర్మకర్త నంబి పార్థసారథి ఆధ్వర్యంలో వేద పండితులు నంబి విజయ్‌సారథి, వాసుదేవాచార్యులు, వేణు, విష్ణు వేదమంత్రోచ్చారణల మధ్య దేవీదేవేరుల వివాహం అంగరంగ వైభవంగా సాగింది. తొలుత గర్భాలయంలో స్వామివారి మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా ప్రత్యేకపూజలు నిర్వహించి, స్వామి వార్లకు వివాహ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి, మంగళ వాయిద్యాలతో గర్భాలయం నుంచి పూల పల్లకీలో కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. నర్సన్నను, లక్ష్మీదేవిని ఎదురెదురుగా శాస్త్రోక్తంగా వివాహం జరిపించారు. కల్యాణ క్రతువులో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. వేముల సతీమణి నీరజారెడ్డి.. స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. వారికి ఆలయ ధర్మకర్త నంబి పార్థసారథి తీర్థప్రసాదాలను ఇచ్చి ఆశీర్వాదాలు అందజేశారు. అంతకుముందు సర్వసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో కమిటీ అధ్యక్షుడు అశోక్ స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. భీమ్‌గల్ పట్టణంలోని సర్వసమాజ్ కమిటీ భవనం నుంచి బాజాభజంత్రీలతో పట్టువస్త్రాలను ఊరేగింపుగా గుట్టకు తీసుకెళ్లారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ నవీన్‌కుమార్ అధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మంగళవారం నృసింహ ఏకాక్షరి హవనం, గరుడ సేవ, చాతుర్మాస్య వ్రత సమాప్తి తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



స్వామివారిని డప్పువాయిద్యాల మధ్య ఎదుర్కొస్తున్న భక్తులు



పత్తి కొనుగోళ్లు చేయాలని ఆందోళన చేస్తున్న రైతులు

# నిలిచిన పత్తి కొనుగోళ్లు

మద్నూర్, నవంబర్ 11 : కామారెడ్డి జిల్లా మద్నూర్ మార్కెట్‌లో సోమవారం పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి. సీసీఐ కొనుగోళ్లలో కొర్రీలు విధించడాన్ని నిరసిస్తూ కాటన్ అసోసియేషన్ పిలుపుమేరకు వ్యాపారులు కొనుగోళ్లు నిలిపివేశారు. అప్పటికే మార్కెట్‌కు పత్తిని తీసుకొచ్చిన రైతులు ఆందోళనకు దిగారు. కాంటాలు బంద్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, హైదరాబాద్‌లో అసోసియేషన్ నాయకులతో మధ్యాహ్నం జరిగిన చర్చలు సఫలమయ్యాయి. రైతులు ఇబ్బందులు పడకుండా ప్రైవేట్, సీసీఐ కొనుగోళ్లు చేపట్టాలని నిర్ణయించారు. దీంతో మధ్యాహ్నం నుంచి కొనుగోళ్లు ప్రారంభించారు. పత్తి రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

## కేసీఆర్ చొరవతోనే పేదలకు ఇండ్లు



బోర్లం క్యాంపులో డబుల్‌బెడ్‌రూం ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బాన్సువాడ రూరల్, నవంబర్ 11:మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతోనే రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా బాన్సువాడ నియోజకవర్గంలో పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరు చేశామని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. మండలంలోని బోర్లం క్యాంపులోని దుర్గమ్మ కాలనీలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను ఆయన సోమవారం ప్రారంభించి మాట్లాడారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బోర్లం మైనార్టీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన జాతీయ విద్యాదినోత్సవంలో పాల్గొన్నారు. అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.


# ఏ కులం పేరుతో సర్వే చేయించుకోవాలి

- అధికారులను ప్రశ్నించిన తండావాసులు
- సర్వేకు సహాయ నిరాకరణ
- కులం పేరు లేదని సర్వే నిలిపివేత

పెద్ద దేవీసింగ్ తండాలో స్థానికులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ కిరణ్మయి



పెద్దకొడప్‌గల్, నవంబర్ 11: మండలంలోని పెద్దదేవీసింగ్ తండావాసులు.. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను నిలిపివేశారు. విషయం తెలిసి బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి సోమవారం తండాకు వచ్చి స్థానికులతో మాట్లాడారు. సర్వేను ఎందుకు నిలిపివేశారని, సర్వేకు సహకరించకపోతే మీరే నష్టపోతారన్నారు. దీంతో అసహనం వ్యక్తంచేసిన తండావాసులు సర్వే ఫారంలో మథుర లంబాడా అని లేదని, మరి ఏ కులం పేరుతో సర్వే చేసుకోవాలని సబ్‌కలెక్టర్‌ను ప్రశ్నించారు. ఫారంలో 240 కులాలు ఉన్నాయని, ఆ జాబితాలో తమ కులం ఎందుకు లేదన్నారు. తమ జాతిని ప్రభుత్వం మరిచి పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబితాలో 240 కులాలను చేర్చినట్లే తమ కులాన్ని కూడా చేర్చి ఉంటే సర్వేకు సహకరించే వాళ్లమని స్పష్టం చేశారు. సర్వే ఫారంలో మథుర అని ఉందని, కానీ మథుర లంబాడా, కాయితీ లంబాడా, లబానా లంబాడా అని ఉంటే సర్వే చేసుకునే వారమన్నారు. వేరే కులం పేరుతో సర్వేలో తమ వివరాలు నమోదుచేస్తే తమ కులమే తొలగిపోతుందని, ఇప్పటికే తమను ఎస్టీల జాబితా నుంచి తొలగించడంతో తాము చాలా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేకు సహకరించాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి సర్దిచెప్పబోగా, తండావాసులు వినిపించుకోలేదు. దీంతో ఈ విషయమై కలెక్టర్‌తో మాట్లాడుతానని చెప్పి ఆమె వెనుదిరిగారు.



# డీపీవోలో ప్రక్షాళన

- 'నమస్తే తెలంగాణ' కథనంతో కదలిక..
- లోతుగా విచారణ చేపట్టిన యంత్రాంగం
- ఏవో, ఎస్‌ఏపై బదిలీ వేటు
- ఒకరు బోధన్‌కు, మరొకరు ఆర్మూర్‌కు..
- మరొకరిపై లోతుగా కొనసాగుతున్న విచారణ

నిజామాబాద్, నవంబర్ 11, (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నిజామాబాద్ జిల్లా పంచాయతీ కార్యాలయంలో ప్రక్షాళన మొదలైంది. ఏండ్లుగా ఒకేచోట పాతుకుపోయి కార్యదర్శులను, ఇతర సిబ్బందిని ఇబ్బందులకు గురిచేస్తున్న ఉద్యోగులపై వేటు పడింది. డీపీవోలో జరుగుతున్న అనైతిక కార్యకలాపాలపై నవంబర్ 5న 'అవినీతి జలగలు' శీర్షికన 'నమస్తే తెలంగాణ' ప్రచురించిన కథనం డీపీవోలో కలకలం రేపింది. సొంత ఉద్యోగులను వేధిస్తున్నా పట్టించుకోని ఆ శాఖ ఉన్నతాధికారుల్లో కదలిక తెప్పించింది. 'నమస్తే' కథనంపై స్పందించిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఏం జరిగిందో నివేదించాలని ఆదేశించారు. దీంతో డీపీవో శ్రీనివాస్ యాక్షన్ టేకెన్ రిపోర్ట్ (ఏటీఆర్)ను సమర్పించారు. నివేదిక ఆధారంగా ఇద్దరు ఉద్యోగులపై కలెక్టర్ బదిలీ వేటు వేశారు.

### ఒకరు ఆర్మూర్‌కు.. మరొకరు బోధన్‌కు..

డీపీవోలో అన్నీ తామే అన్నట్లుగా ఫోజులిచ్చిన సీనియర్ అసిస్టెంట్, ఇన్‌చార్జి పరిపాలన అధికారి (ఏవో)పై బదిలీ వేటుపడింది. ఏవో పోస్టులో ఇన్‌చార్జీగా ఉన్నంత కాలం అనేక ఆరోపణలు ఎదుర్కోవడంతో ఆయనను సీనియర్ అసిస్టెంట్ పోస్టుకే పరిమితం చేస్తూ ఆర్మూర్ డీఎల్పీవోకు బదిలీచేశారు. డీపీవోలో పని చేస్తున్న మరో అధికారిని బోధన్ డీఎల్పీవోకు పంపించారు. వీరితో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో అధికారిపై విచారణ ఇంకా కొనసాగుతున్నది. అవినీతి, అక్రమాలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు డీపీవో శ్రీనివాస్ వివరించారు. డబ్బులు డిమాండ్ చేసిన వారెవ్వరినీ వదిలిపెట్టేది లేదని స్పష్టంచేశారు. మొత్తానికి డీపీవోలో ప్రక్షాళన మొదలవ్వడంపై నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులు, డీపీవోలోని ఉద్యోగులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ బాధలను వెలుగులోకి తీసుకు వచ్చిన 'నమస్తే తెలంగాణ' దినపత్రికకు పలువురు కృతజ్ఞతలు తెలియజేశారు. మరోవైపు, బదిలీతోనే సరిపెట్టకుండా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలంటూ కార్యదర్శులు డిమాండ్ చేస్తున్నారు.

### ఏసీ దృష్టి పెడితేనే..?

గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాలు లేకుండా అభివృద్ధి కుంటుపడింది. పాలకవర్గాలు దిగిపోయి నెలలు గడుస్తున్నా రేవంత్ సర్కారు ఎన్నికల ఊసే ఎత్తడం లేదు. దీంతో పల్లెల్లో పాలన స్తంభించింది. చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు. పంచాయతీ కార్యదర్శులకు ఉన్న పరిమిత అధికారాలతో గ్రామ పంచాయతీలను నెట్టుకొస్తున్నారు. స్పెషల్ ఆఫీసర్లను నియమించినప్పటికీ పెద్దగా ఫలితం లేదు. స్థానిక సంస్థల నిర్వహణకు ప్రత్యేకంగా అదనపు కలెక్టర్ స్థాయిలో ఐఏఎస్ అధికారి పని చేస్తున్నారు. కేసీఆర్ హయాంలోనే ఈ వ్యవస్థ పురుడు పోసుకున్నది. ప్రస్తుతం నిజామాబాద్‌కు అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా అంకిత్ పనిచేస్తున్నారు. నిరంతర తనిఖీలు, క్షేత్ర పర్యటనలు చేస్తే పంచాయతీల్లో పాలన కుంటు పడకుండా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న వేళ.. ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుని ప్రజల అవసరాలను గుర్తించి తీర్చాలంటూ వినతులు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు అదనపు కలెక్టర్ మరింతగా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

# నత్తనడకన సర్వే

- పూర్తిస్థాయిలో స్టిక్కర్లు అతికించని వైనం
- ఏ ప్రాంతంలో సర్వే ఎప్పుడో సమాచారం కరువు
- పనులు మానుకుని ఇంటి వద్దే ఉంటున్న కూలీలు

కంఠేశ్వర్, నవంబర్ 11: జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే నత్తనడకన కొనసాగుతున్నది. అధికారుల పర్యవేక్షణ కరువవడంతో క్షేత్రస్థాయిలో గందరగోళం నెలకొంది. సమగ్ర కార్యాచరణ కరువవడం, సరైన ప్రణాళిక లేకపోవడం, ఏ ప్రాంతంలో ఎప్పుడు సర్వే చేస్తారో తెలియక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏ సమయంలో సర్వేకు వస్తారో తెలియక రోజువారీ కూలీలు పనులు మానుకుని ఇంటి వద్దే ఉంటున్నారు. మరోవైపు, సర్వేకు వస్తున్న వారికి ప్రజల నుంచి ప్రశ్నలు ఎదురవుతుండడం, వివరాలు ఇచ్చేందుకు వెనుకాముందు చేస్తుండడంతో ఎన్యుమరేటర్లకు ఏం చేయాలో పాలు పోవడం లేదు. దీంతో ఒక్కో ఇంటి వద్ద గంటకు పైగా సమయం వెచ్చించాల్సి వస్తుంది.

### పూర్తి కాని స్టిక్కరింగ్..

ఈ నెల 6న ప్రారంభమైన ఇంటింటి సర్వేలో భాగంగా తొలి మూడు రోజుల పాటు స్టిక్కరింగ్ కార్యక్రమం చేపట్టారు. అయితే, జిల్లాలో పూర్తిస్థాయిలో స్టిక్కరింగ్ చేయలేదు. జిల్లాకేంద్రంలోని దాదాపు అన్ని ప్రాంతాల ప్రజలు తమ ఇండ్ల వద్దకు ఎవరూ రాలేదని, స్టిక్కరింగ్ చేయలేదని చెబుతున్నారు. నగరంలోని 60 డివిజన్ల పరిధిలోని వేలాది గృహాలకు స్టిక్కర్లు అంటించలేదని తెలిసింది. సర్వేకు వచ్చే సమయంలోనే అతికిస్తున్నారని తెలిసింది. మరోవైపు, ఏ సమయంలో సర్వే సిబ్బంది వస్తారో తెలియక ప్రజలు, రోజువారీ కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటికి తాళం వేసి వెళ్తే సర్వే సిబ్బంది వచ్చి వెళ్తారేమోనని భయంతో పనులు మానుకుని ఇంటి వద్దే ఉంటున్నారు.

### ఒక్కో ఇంటికి 45 నిమిషాలు..

సర్వేలో భాగంగా వివరాలు నమోదు చేయడానికి ఒక్కొక్క ఇంటికి దాదాపు 45 నిమిషాల నుంచి గంట సమయం పడుతున్నది. సర్వేకు వచ్చే వారికి ప్రజల నుంచి రకరకాల ప్రశ్నలు ఎదురవుతున్నాయి. అసలు వివరాలు ఎందుకు చెప్పాలి? ఆస్తుల వివరాలు మీకెందుకు? సమాచారమంతా తీసుకుని ప్రభుత్వ పథకాలు ఎగ్గొడతారా? వంటి సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, రేవంత్ సర్కారు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఎన్యుమరేటర్లను అక్కడక్కడ ప్రశ్నిస్తున్న ఉదంతాలు చోటు చేసుకుంటున్నాయి. ఆయా ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, వివరాలు సేకరించలేక సర్వే సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. ఒక్కో ఇంటి వద్ద సుమారు గంట సమయం వెచ్చిస్తూ జనాలకు సర్దిచెప్పేందుకు యత్నిస్తున్నారు. ఇలాగైతే నిర్దేశిత సమయంలోగా సర్వే పూర్తి చేయడం కష్టమేనని ఎన్యుమరేటర్లు వాపోతున్నారు. మరోవైపు, ఈ నెల 21లోగా సర్వే పూర్తి చేయాల్సి ఉండగా, ఒకరోజు అటు ఇటుగా పూర్తి చేస్తామని నిజామాబాద్ నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ రాజేంద్ర కుమార్ తెలిపారు.



నిజామాబాద్ నగరంలో సర్వే వివరాలు సేకరిస్తున్న అధికారిణి

## ఇద్దరు టీచర్లపై వేటు..

కామారెడ్డి, నవంబర్ 11 : విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరు టీచర్లపై వేటు పడింది. భిక్కనూరు మండలం కాచాపూర్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు శ్రీనివాస్, కాంతారెడ్డిని విధుల నుంచి తప్పించారు. ఈ మేరకు డీఈవో రాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

## బస్తాల్లేక నిలిచిన కాంటాలు



గోపాల్‌పేటలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు

నాగిరెడ్డిపేట, నవంబర్ 11: ధాన్యం కొనుగోళ్లలో అంతులేని జాప్యం జరుగుతున్నది. గన్నీ బ్యాగులు లేకపోవడంతో కాంటాలు నిలిచిపోయాయి. మాల్తుమ్మెద సింగిల్ విండో పరిధిలోని గోలిలింగాల, చీనూర్, మేజర్‌వాడి, గోపాల్‌పేట, నాగిరెడ్డిపేట ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బస్తాలు లేక ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. కేంద్రాలకు సివిల్ సప్లయ్ ద్వారా ఐదు గట్టాల చొప్పున బస్తాలను సరఫరా చేయగా ఆదివారమే ఖాళీ అయ్యాయి. దీంతో సోమవారం ధాన్యం సేకరణ నిలిచిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోళ్లు నిలిచిపోవడంపై మాల్తుమ్మెద విండో కార్యదర్శి సందీప్‌ను వివరణ కోరగా.. ఐదు గ్రామాల్లో సంచుల కొరత ఉన్న మాట వాస్తవమేనని తెలిపారు. గన్నీబ్యాగులు వస్తాయని, రైతులు ఆందోళన చెందొద్దని ఆయన సూచించారు.

## బాసర ట్రిపుల్ ఐటీలో ఆర్మూర్ విద్యార్థిని ఆత్మహత్య



స్వాతిప్రియ (ఫైల్)

ఆర్మూర్‌టౌన్, నవంబర్ 11 : బాసర ట్రిపుల్ ఐటీలో చదువుతున్న నిజామాబాద్ జిల్లాకు చెందిన విద్యార్థిని ఆదివారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నది. కామారెడ్డి జిల్లా బిచ్కుంద ప్రాంతానికి చెందిన రవీందర్, ఉజ్వల దంపతులు పదిహేనేండ్ల క్రితం ఆర్మూర్‌కు వలస వచ్చారు. పెర్కిట్‌లోని తిరుమల కాలనీలో నివాసముంటున్నారు. వారి రెండో కూతురు స్వాతిప్రియ (18) బాసరలోని ట్రిపుల్ ఐటీలో పీయూసీ సెకండియర్ చదువుతున్నది. దసరా, దీపావళి పండుగలకు ఇంటికి వచ్చిన ఆమె సంతోషంగా గడిపింది. ఇటీవలే తిరిగి కాలేజీకి వెళ్లిన ఆమె.. హాస్టల్‌లోని తన గదిలో ఆదివారం అర్ధరాత్రి ఉరేసుకున్నది. ఈ విషయం తెలియగానే కుటుంబసభ్యులు హుటాహుటిన బాసరకు తరలివెళ్లారు. విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

